


తెలుగు జాతీయ దినపత్రిక
# అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక




ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక :95 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజీలు : 10, వెల. 6రూ/ బుధవారం 28 జనవరి 2026



## 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికల
# షెడ్యూల్ విడుదల

తక్షణమే రాష్ట్రంలో అమల్లోకి ఎన్నికల కోడ్
నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ
ఫిబ్రవరి 16న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక




2

## పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై
# సీఎం చంద్రబాబు సమీక్ష

- రాయలసీమ, ప్రకాశం జిల్లాల సమగ్రాభివృద్ధిపై ప్రధానంగా దృష్టి
- 500 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన ఉత్పత్తులే లక్ష్యంగా కార్యాచరణ
- ప్రాధాన్యత క్రమంలో 20కి పైగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఆదేశం
- గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణకు ప్రణాళికలు

2

రాష్ట్రంలో పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన నిర్మాణాలను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను ప్రపంచంలోనే అతిపెద్ద ఉద్యాన క్లస్టర్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో 10 జిల్లాలను ఉద్యాన కేంద్రాలుగా మార్చే సమీకృత అభివృద్ధి ప్రణాళికలపై మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

### 20 ప్రాజెక్టుల పూర్తికి ప్రణాళికలు

గత ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, అనేక ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టిందని ఈ సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, 10 జిల్లాల పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. తక్కువ నిధులతో త్వరగా పూర్తయ్యే వాటికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

ఈ ఏడాదిలోనే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణకు వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గాలేరు-నగరి ద్వారా కృష్ణా జలాలను కడప వరకు తీసుకెళ్లే అంశంపై దృష్టి సారించాలన్నారు.

## టీడీపీ బలం, బలగం
# కార్యకర్తలే

-నారా లోకేశ్
-గ్రామ స్థాయి కార్యకర్త పొలిట్‌బ్యూరో వరకు ఎదగాలని ఆకాంక్ష
-పార్టీ పదవులకు టర్మ్ లిమిట్ ఉండాలని ప్రతిపాదన
-పెన్షన్లకే ఏటా రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్న మంత్రి



2

# ఏపీకి రానున్న రాహుల్ గాంధీ...

## -షర్మిల ఆహ్వానానికి గ్రీన్ సిగ్నల్

-ఢిల్లీలో రాహుల్ గాంధీతో సమావేశమైన ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల
-ఉపాధి హామీ పరిరక్షణ ఉద్యమంలో పాల్గొనాలని రాహుల్‌కు ఆహ్వానం
-షర్మిల విజ్ఞప్తికి సానుకూల స్పందన... ఏపీకి వస్తానని రాహుల్ హామీ



2

## మేడారం జాతరకు
# సర్వం సిద్ధం...

-నాలుగు రోజుల పాటు జరగనున్న మేడారం సమ్మక్క-సారక్క మహాజాతర ప్రారంభం
ఈ వేడుకకు రెండు కోట్ల మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా
రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ. 251 కోట్లతో భారీ ఏర్పాట్లు

2



# ఢిల్లీలో చారిత్రక ఘట్టం..

## భారత్-ఈయూ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' ఖరారు

-భారత్, యూరప్ సమాఖ్య మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారు
-'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించిన ఈయూ కమిషన్ అధ్యక్షురాలు
-18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత తుది రూపం
-భారత్ నుంచి 97 శాతం ఎగుమతులపై సుంకాల రద్దు
-వచ్చే ఏడాది నుంచి ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం

2



విజేత



# పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై సీఎం చంద్రబాబు సమీక్ష

మొత్తంగా 20కి పైగా ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా కొత్తగా 8.87 లక్షల ఎకరాల ఆయకట్టుకు, మరో 4.30 లక్షల ఎకరాల స్థిరీకరణకు నీరందించవచ్చని అధికారులు సీఎంకు వివరించారు. ఇదే సమయంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ ప్రాజెక్టులు చేపట్టాలని, పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయితే గోదావరి జలాలను ఉత్తరాంధ్ర వరకు తీసుకెళ్లి, పోలవరం-వంశధార నదుల అనుసంధానం చేపట్టవచ్చని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

**ప్రపంచస్థాయి ఉద్యాన హబ్‌గా రాయలసీమ**

ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ఉద్యాన పంటల సాగు గణనీయంగా పెరుగుతుందని మంత్రి అచ్చెన్నాయుడు అభిప్రాయపడ్డారు. గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా 500 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను పండించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సీఎం సూచించారు.

రాష్ట్రంలోని 10 జిల్లాల్లో 201 క్లస్టర్లు, 303 మండలాల్లో ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. మూడేళ్లలో ఉద్యాన సాగు విస్తీర్ణాన్ని 8.41 లక్షల హెక్టార్ల నుంచి 14.41 లక్షల హెక్టార్లకు పెంచేలా ప్రణాళికలు రూపొందించారు. దుబాయ్‌కి చెందిన డీపీ వరల్డ్ సంస్థ ఏపీలో ఉద్యాన క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చిందని సీఎం వెల్లడించారు.

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన గ్రామీణ రహదారుల నెట్‌వర్క్, లాజిస్టిక్స్, మార్కెట్, గ్లోబల్ కనెక్టివిటీపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.

ఈ బృహత్తర ప్రణాళికల అమలుకు పూర్వోదయ, సాస్కీ, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పోర్ట్ కనెక్టివిటీ, గోదాములు, కోల్డ్ చైన్ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

10 జిల్లాల్లో ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయనున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల వివరాలు:

- వెలిగొండ ప్రాజెక్ట్
- కొరిశపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం
- పాలేరు రిజర్వాయర్
- మల్లెమడుగు లిఫ్ట్-రిజర్వాయర్
- శ్రీ బాలాజీ రిజర్వాయర్
- కుప్పం బ్రాంచ్ కెనాల్
- పుంగనూరు బ్రాంచ్ కెనాల్
- మూలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం
- హంద్రీ-నీవా ప్రధాన కాల్వ పనులు
- అట్లూరుపాడు-మేర్లపాక ఎస్ఎస్ఎల్పీ
- నీవా బ్రాంచ్ కెనాల్ పనులు
- జీడిపల్లి-భైరవానితిప్ప లిఫ్ట్ ఇరిగేషన్ పథకం
- జీడిపల్లి-అప్పర్ పెన్నార్ ఎత్తిపోతలు
- అనంతలో కమ్యూనిటీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్
- మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులు
- పేరూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం
- కడప, కోడూరు వరకు గాలేరు-నగరి సుజల స్రవంతి
- అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు
- పశ్చిమ కర్నూలుకు నీళ్లిచ్చేలా వేదవతి-అలగనూరు-గాజులదిన్నె ప్రాజెక్టులు
- ఏడు జిల్లాల్లో 1,011 మైనర్ ఇరిగేషన్ చెరువుల అభివృద్ధి

# టీడీపీ బలం, బలగం కార్యకర్తలే

మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలోనూ మార్పులు రావాలని, గ్రామ స్థాయి పార్టీ అధ్యక్షుడు పొలిట్‌బ్యూరో స్థాయి వరకు ఎదిగేలా సంస్కరణలు చేపట్టాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. పార్టీకి కార్యకర్తలే బలం, బలగం అని, వారి త్యాగాల పునాదులపైనే తెలుగుదేశం పార్టీ నిలబడి ఉందని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నూతనంగా నియమితులైన 25 పార్లమెంట్ నియోజకవర్గాల కమిటీల కోసం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేశ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**తెలుగుదేశం పార్టీ బలం, బలగం కార్యకర్తలు**

దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకి లేని బలమైన కార్యకర్తల వ్యవస్థ ఒక్క తెలుగుదేశానికే సొంతమని లోకేశ్ అన్నారు. "స్వర్గీయ ఎన్టీఆర్ ఏ ముహూర్తంలో పార్టీ స్థాపించారో కానీ, మన బలం, బలగం మన కార్యకర్తలే. పుంగనూరులో నామినేషన్ పత్రాలు లాక్కున్నప్పుడు మీసాలు మెలేసిన అంజిరెడ్డి తాత, మాచర్లలో రక్తమోడుతున్నా పోలింగ్ బూత్‌లో నిలబడిన మంజుల, విజయవాడలో కంటిచూపు కోల్పోయినా జై టీడీపీ అన్న చెన్నుపాటి గాంధీ, మెడపై కత్తిపెట్టినా జై చంద్రబాబు అని ప్రాణాలు విడిచిన తోట చంద్రయ్య వంటి కార్యకర్తలే నాకు స్ఫూర్తి" అని ఆయన ఉద్వేగంగా ప్రసంగించారు.

**దేశంలో అభివృద్ధి, సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ సీబీఎన్**

దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసిందే టీడీపీ అని లోకేశ్ గుర్తుచేశారు. "1983లోనే రూ.2కే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, మహిళలకు ఆస్తి హక్కు వంటివి ఎన్టీఆర్ తెచ్చారు. ఆయన స్ఫూర్తితో సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల బండిలా చంద్రబాబు ముందుకు నడిపిస్తున్నారు. దేశంలో అభివృద్ధి, సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ ఆయనే. 75 ఏళ్ల వయసులో కూడా ఆయనలో ముగ్గురు 25 ఏళ్ల యువకులు ఉన్నారు. నిత్యం ప్రజల గురించే ఆలోచిస్తారు" అని కొనియాడారు.

**కల్తీ నెయ్యి, కోడికత్తి, కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్లు టీం 11**

చంద్రబాబు ముందుచూపు వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని లోకేశ్ తెలిపారు. 1995లో ఐటీ గురించి మాట్లాడితే ఎగతాళి చేశారని, కానీ నేడు సైబరాబాద్ వల్లే లక్షలాది కుటుంబాలు బాగుపడ్డాయని అన్నారు. "మన నాయకుడు అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ అయితే, కల్తీ నెయ్యి, కోడికత్తి, కల్తీ మద్యానికి 'టీం 11' బ్రాండ్ అంబాసిడర్లు" అంటూ గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆర్సెలార్ మిట్టల్, గూగుల్ వంటి సంస్థలు ఏపీకి రావడానికి చంద్రబాబుపై ఉన్న నమ్మకమే కారణమన్నారు.

**ఒక్క పెన్షన్ లకే ఏడాదికి రూ.30వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం**

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నామని లోకేశ్ తెలిపారు. "దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ.4 వేల పెన్షన్ ఇస్తున్నాం. వికలాంగులకు రూ.6 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు అందిస్తున్నాం. ఒక్క పెన్షన్లకే ఏడాదికి రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, 150 రోజుల్లో 16 వేల డీఎస్సీ పోస్టుల భర్తీ వంటివి పూర్తిచేశాం" అని వివరించారు.

**చేసిన పనులు చెప్పుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది**

ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నేతలపై ఉందని లోకేశ్ సూచించారు. "మనం పనులు చేయడం ఎంత ముఖ్యమో, చేసిన పనులను చెప్పుకోవడం కూడా అంతే ముఖ్యం. పెన్షన్ చరిత్రను ప్రజలకు వివరించాలి. రూ.200 ఉన్న పెన్షన్‌ను మనమే రూ.2 వేలు చేసి, ఇప్పుడు రూ.4 వేలకు పెంచామని స్పష్టంగా చెప్పాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

**గ్రామ పార్టీ అధ్యక్షుడు పొలిట్ బ్యూరో వరకు ఎదగాలి**

పార్టీలో అంతర్గత సంస్కరణల ఆవశ్యకతను లోకేశ్ నొక్కిచెప్పారు. "పార్టీలో ప్రతి పదవికి టర్మ్ లిమిట్ ఉండాలి. ఒకే వ్యక్తి ఒక పదవిలో రెండుసార్లు కంటే ఎక్కువ ఉండకూడదు. వారు ప్రమోట్ కావాలి. ఒక సామాన్య గ్రామ పార్టీ అధ్యక్షుడు పొలిట్‌బ్యూరో వరకు ఎందుకు రాకూడదు? దీనికోసం పొలిట్‌బ్యూరోలో పోరాడాను" అని తెలిపారు.

**రాజకీయాల్లో యువతను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనపై ఉంది**

మహానాడులో తీర్మానించిన 'ఆరు శాసనాలను' పార్టీ నాయకులు తప్పనిసరిగా పాటించాలని లోకేశ్ ఆదేశించారు. కార్యకర్తలకే పెద్దపీట వేయాలని, యువతను రాజకీయాల్లోకి ప్రోత్సహించాలని, సామాజిక న్యాయం పాటించాలని, మహిళలను గౌరవించాలని సూచించారు. అన్నదాతకు అండగా నిలుస్తూ, తెలుగుజాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పార్టీ శ్రేణులకు ఉద్బోధించారు.

# మేడారం జాతరకు సర్వం సిద్ధం...

తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర, మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర రేపు (జనవరి 28) ప్రారంభం కానుంది. ములుగు జిల్లాలోని మేడారం గ్రామంలో జరిగే ఈ నాలుగు రోజుల వేడుకకు దేశం నలుమూలల నుంచి సుమారు రెండు కోట్లకు పైగా భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌కు దాదాపు 240 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గిరిజన పుణ్యక్షేత్రం ఇప్పటికే జనసంద్రంగా మారింది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా సహా పలు రాష్ట్రాల నుంచి గిరిజనులు, గిరిజనేతరులు ఈ జాతరకు పోటెత్తుతున్నారు. ఇప్పటికే గత కొద్ది రోజులుగా దాదాపు 10 లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. వనదేవతలైన సమ్మక్క, సారలమ్మల వీరత్వాన్ని, త్యాగాన్ని స్మరించుకుంటూ రెండేళ్లకోసారి ఈ జాతరను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

**ప్రభుత్వం భారీ ఏర్పాట్లు**

ఈ ఏడాది జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 251 కోట్లు ఖర్చు చేసింది. 21 శాఖలకు చెందిన 42,000 మందికి పైగా అధికారులు, సిబ్బందిని, 2000 మంది ఆదివాసీ వాలంటీర్లను భక్తుల సేవ కోసం నియమించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా 13,000 మంది పోలీసులను మోహరించారు. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత డ్రోన్లతో జాతరను పర్యవేక్షిస్తున్నారు. 1,418 ఎకరాల్లో 42 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. జంపన్న వాగు వద్ద 200 మంది గజ ఈతగాళ్లను, 30 వైద్య శిబిరాల్లో 5,192 మంది వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పారిశుద్ధ్యం కోసం 5,000 మంది కార్మికులు, 5,700 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు.

భక్తుల రవాణా కోసం టీజీఎస్‌ఆర్టీసీ 4,000 ప్రత్యేక బస్సులను, దక్షిణ మధ్య రైల్వే 28 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. పర్యాటక శాఖ హనుమకొండ నుంచి మేడారానికి హెలికాప్టర్ సేవలను కూడా అందిస్తోంది. రౌండ్ ట్రిప్‌తో కూడిన వీఐపీ దర్శనానికి రూ. 35,999, జాతర ఏరియల్ వ్యూ కోసం ఒక్కొక్కరికి రూ. 4,800 చొప్పున ఛార్జీలను నిర్ణయించారు.

**జాతర నేపథ్యం, సంప్రదాయాలు**

కాకతీయ పాలకుల పన్నుల విధానాన్ని ఎదిరించి పోరాడిన గిరిజన వీరవనితలు సమ్మక్క, ఆమె కుమార్తె సారక్క (సారలమ్మ)ల శౌర్యాన్ని స్మరించుకుంటూ ఈ జాతరను నిర్వహిస్తారు. కోయ తెగకు చెందిన ఈ తల్లీకూతుళ్లను గిరిజనులు దేవతలుగా కొలుస్తారు. పోరాటంలో అలసిపోయిన సమ్మక్క చిలుకలగుట్ట వైపు వెళ్లి అదృశ్యమయ్యిందని, ఆమె కోసం వెతికిన గిరిజనులకు ఓ వెదురు చెట్టు కింద కుంకుమ భరిణె మాత్రమే లభించిందని స్థానిక కథనం. అప్పటి నుంచి రెండేళ్లకోసారి గిరిజన పూజారులు వెదురు వనంలో ప్రత్యేక పూజలు చేసి, కుంకుమ భరిణె, ఎర్రటి వస్త్రం చుట్టిన వెదురు కర్రను సమ్మక్క ప్రతిరూపంగా భావించి గద్దెల వద్దకు తీసుకువస్తారు. అంతకుముందు రోజు కన్నేపల్లి నుంచి సారలమ్మను తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్ఠించడంతో జాతర అధికారికంగా మొదలవుతుంది. భక్తులు తమ బరువుకు సమానమైన బెల్లాన్ని (బంగారం) అమ్మవార్లకు సమర్పిస్తారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించడం ఇక్కడి ముఖ్యమైన సంప్రదాయం



# 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల

తెలంగాణ రాష్ట్రంలోని 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల కోసం రేపటి నుంచి ఈ నెల 30 వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 3వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు ఉంటుందని వెల్లడించారు. వచ్చే నెల 16వ తేదీన కార్పొరేషన్‌లలో మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపాలిటీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు పరోక్ష పద్ధతిలో జరుగుతాయని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో 52 లక్షల 43 వేల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 130 మున్సిపాలిటీలు ఉంటే వివిధ కారణాలతో 116 మున్సిపాలిటీలలో మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. కంట్రోల్ రూం నుంచి ఓటింగ్ ప్రక్రియను మానిటరింగ్ చేయనున్నట్లు తెలిపారు. రూ.50 వేలకు మించి నగదుకు లెక్క చూపవలసి ఉంటుందని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతాయని తెలిపారు.

# ఢిల్లీలో చారిత్రక ఘట్టం..

భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ఖరారైంది. 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత కుదిరిన ఈ ఒప్పందాన్ని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. ఈరోజు న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా, కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టాలతో జరిగిన 16వ శిఖరాగ్ర సమావేశంలో ఈ ఒప్పందాన్ని అధికారికంగా ఖరారు చేశారు. ఈ ఒప్పందం ద్వారా భారత్ నుంచి జరిగే 97 శాతం ఎగుమతులపై సుంకాలు రద్దు కానున్నాయి. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, రత్నాలు, లెదర్ వంటి రంగాలకు ఇది భారీ ఊతాన్ని ఇవ్వనుంది. అదే సమయంలో యూరప్ కార్లు, యంత్ర పరికరాలకు భారత మార్కెట్‌లోకి ప్రవేశం సులభతరం అవుతుంది. "ఈరోజు యూరప్, భారత్ చరిత్ర సృష్టిస్తున్నాయి. మేం 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'ను ముగించాం. ఇరుపక్షాలకు ప్రయోజనం చేకూర్చేలా 200 కోట్ల మంది ప్రజలతో స్వేచ్ఛా వాణిజ్య క్షేత్రాన్ని సృష్టించాం" అని ఉర్సులా 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఈ ఒప్పందం రెండు ప్రపంచ దిగ్గజాల మధ్య భాగస్వామ్యానికి చక్కటి ఉదాహరణ అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వాణిజ్యంతో పాటు రక్షణ, భద్రత, వాతావరణ మార్పులు, కీలక సాంకేతికతలు వంటి అంశాలపై కూడా ఇరుపక్షాలు దృష్టి సారించాయి. అమెరికా, చైనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, ఇతర ప్రాంతాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని చూస్తున్న ఐరోపాకు ఈ ఒప్పందం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ఒప్పందం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.

# ఏపీకి రానున్న రాహుల్ గాంధీ...

ఏపీ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న ఉద్యమంలో పాల్గొనాలని ఆమె చేసిన ఆహ్వానానికి రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించారు. ఏపీ పర్యటనకు వస్తానని, పార్టీ పోరాటంలో భాగస్వామ్యం అవుతానని ఆయన హామీ ఇచ్చినట్టు షర్మిల తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని 10 జనపథ్‌లో ఉన్న రాహుల్ గాంధీ నివాసంలో ఈ సమావేశం జరిగింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ ఉద్యమంలో పాల్గొనాల్సిందిగా షర్మిల రాహుల్‌ను కోరారు. ఇందుకు రాహుల్ అంగీకరించారని, త్వరలోనే ఏపీకి వస్తానని మాట ఇచ్చారని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 2వ తేదీతో ఉపాధి హామీ పథకం ప్రారంభమై 20 ఏళ్లు పూర్తికానుంది. ఈ నేపథ్యంలో, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామం నుంచే ఈ ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్టు షర్మిల వివరించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని ఆమె వెల్లడించారు

# తుగ్గలి లోఆయుర్వేద ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కోసం భూమి పూజ చేసిన -ఎమ్మెల్యే కె.ఈ శ్యామ్ కుమార్....

పత్తికొండ

తుగ్గలి:మండల కేంద్రమైన తుగ్గలి లో ఆయుర్వేద ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కోసం పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యామ్ కుమార్ మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఆయుర్వేద ఆస్పత్రి వైద్య అధికారి డాక్టర్ అమర్నాథ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు డాక్టర్ కిరణ్, డాక్టర్ రోజా రాణి, వైద్య సిబ్బంది ఎమ్మెల్యే కే శ్యామ్ కుమార్ కు స్వాగతం పలికి శాలువా పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ ఇక్కడ పనిచేస్తున్న ఆయుర్వేద వైద్య అధికారి డాక్టర్ అమర్నాథ్, అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు డాక్టర్ కిరణ్, డాక్టర్ రోజా రాణి, లు చక్కగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు వైద్య సేవలు అందివ్వడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఇక్కడ ప్రజలకు మరింత ఆయుర్వేద వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేకంగా రూ 20 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, సర్పంచ్ రవి, కాంట్రాక్టర్ కొత్తూరు శివరాముడు చౌదరి, ఎంపీడీవో విశ్వమ్మోహన్, ఈ ఓ ఆర్ డి పి. శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వైద్య ఆరోగ్యశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. చిరంజీవి లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. మనోహర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# అరకు చలి ఉత్సాహాలకు ముమ్మర ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్




అక్షర విజేత అరకులోయ..

ప్రముఖ పర్యాట కేంద్రమైన ఆంధ్ర ఊటీ అరకు లోయలు ప్రకృతి ఒడిలో సేదతీరాలనుకునే జనవరి 27 పర్యాటకులకు శుభవార్త, అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు లోయలో ఈ నెల జనవరి 29వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు 'అరకు ఫెస్ట్ - 2026' అట్టహాసంగా జరగనుంది. గతేడాది 'చలి అరకు ఫెస్టివల్' విజయవంతం కావడంతో, గిరిజన సంస్కృతిని, అరకు అందాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ ఉత్సవాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ అన్నారు.మంగళవారం అరుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పత్రిక సమావేశంలో మాట్లాడుతూ జనవరి 29వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు గౌరవ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరకు వ్యాలీలోని డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో ఈ వేడుకలను అధికారికంగా ప్రారంభిస్తారు. పర్యటనలో భాగంగా ఆయన చొంపి గ్రామాన్ని సందర్శించి, అక్కడ అమలు చేస్తున్న హోమ్‌స్టే పాలసీని పరిశీలించనున్నారు. గిరిజన ఇళ్లలో పర్యాటకుల బస, వారి ఆతిథ్యంపై ముఖ్యమంత్రి స్వయంగా గిరిజనులతో చర్చించనున్నారు.పర్యాటకులకు థ్రిల్లింగ్ అనుభూతిని అందించేందుకు ఈసారి భారీగా ఏర్పాట్లు చేశారు, మాడగడ ప్రాంతంలో పారా గ్లైడింగ్, పారా మోటరింగ్‌తో పాటు, పర్యాటకుల కోసం ప్రత్యేకంగా హెలికాప్టర్ (చాపర్) రైడ్, హాట్ ఎయిర్ బెలూన్లను అందుబాటులోకి తెస్తున్నారు. వైజాగ్ టీమ్ ఆధ్వర్యంలో తొలిసారిగా స్కూబా డైవింగ్ వంటి సాహస క్రీడలను ప్రవేశపెడుతున్నారు.అలాగే గాలి కొండ, సుంకరమెట్ట ప్రాంతాల్లో ట్రెక్కింగ్ ఉంటుంది. జనవరి 31న 5ఖ రన్ (అరకు మారథాన్) నిర్వహించడం జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రాష్ట్రాల గిరిజన తెగలు తమ సంప్రదాయ నృత్యాలు, కళలతో భారీ కార్నివాల్ నిర్వహించనున్నారు. ఈశాన్య రాష్ట్రాలు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, తెలంగాణ వంటి రాష్ట్రాల నుంచి వచ్చే కళాకారులు స్టాల్స్ ఏర్పాటు చేస్తారు. ఇక్కడ లభించే గిరిజన హస్తకళా వస్తువులను పర్యాటకులు రాయితీ ధరలకే కొనుగోలు చేయవచ్చు. అలాగే పద్మాపురం గార్డెన్స్‌లో అద్భుతమైన ఫ్లవర్ షో, సరికొత్త 'అరకు బొకే' ఆవిష్కరణ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.తిరుపతి ఇండియన్ క్యులినరీ ఇన్స్టిట్యూట్ సహకారంతో విశిష్ట గిరిజన వంటకాలను పర్యాటకులకు వడ్డించనున్నారు. ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ గాయని సునీత గారి లైవ్ కాన్సర్ట్ ఉంటుంది. ముగింపు వేడుకల్లో భాగంగా ఫిబ్రవరి 1న ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్.ఎస్. థమన్ గారి లైవ్ షోతో పాటు, ఆకాశంలో అద్భుతమైన డ్రోన్ షో నిర్వహించనున్నారు.ఈ వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, 'శ్రేయాస్ మీడియా' ఈవెంట్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పర్యాటకులు మారథాన్, సైక్లింగ్ పోటీలకు ఆన్‌లైన్ లేదా ఞ= కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.ఈ పత్రికా సమావేశంలో ఎస్పీ అమిత్ బర్దర్, డిఎస్పి అభిషేక్ ఉన్నారు

# యువగళానికి మూడేళ్లు-యువనేతా వర్ధిల్లు నూరేళ్లు

## -లోకేష్ కు కాలవ అభినందన

అక్షర విజేత రాయదుర్గం

తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సరిగ్గా మూడేళ్ల కిందట చేపట్టిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకేయ చరిత్రను తిరగరాసిందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కొనియాడారు. యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న శుభ సందర్భంలో మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో మంగళవారం ఉదయం లోకేష్ బాబుకు కాలవ అభినందనలు తెలిపారు. ఒక అడుగుతో, ఒక్కరు ప్రారంభించిన యువగళం ప్రజాగళమై, ఒక ప్రభంజనాన్ని సృష్టించిందన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అరాచక పాలనను అంతం చేసేందుకు యువనేత పూరించిన సమర శంఖం ఓ అపూర్వ ఘట్టమన్నారు. 2024 ఎన్నికల్లో శత్రువుల కోటను బద్దలు కొట్టించి ప్రత్యర్థికి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కనివ్వకుండా చేసిందన్నారు. కుప్పంలోని శ్రీ వరదరాజ స్వామి పాదాల చెంత ప్రారంభమై 226 రోజుల పాటు 3132 కిలోమీటర్లు కొనసాగడం అద్భుతమన్నారు. కోటిన్నర మంది కష్టసుఖాలు వింటూ, వారిలో ధైర్యం నింపుతూ, సాగిన పాదయాత్రను జగన్ రెడ్డి దుష్టపాలనపై లోకేష్ పూరించిన శంఖారావంగా ఆయన అభివర్ణించారు. అధికారంలోకొచ్చిన తరువాత పాదయాత్రలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న ఘనత లోకేష్ సొంతమన్నారు. ముఖ్యంగా యువతకు ఉద్యోగాల కల్పనలో భాగంగా భారీ పెట్టుబడులను లోకేష్ ఆకర్షిస్తున్న తీరు అందరినీ ఆశ్చర్యపరుస్తోందన్నారు. మాటల్లో ఖచ్చితత్వం, పాలనలో మునుపెన్నడూ చూడని వేగం వెరసి లోకేష్ మార్గం అనితరసాధ్యంగా సాగుతోందని కాలవ ప్రస్తుతించారు. భవిష్యత్తులో మరిన్ని అపురూప విజయాలు ఆయన ఖాతాలో వచ్చి చేరడం ఖాయమన్నారు.

# పశుపతినాథస్వామి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే కాలవ విన్నపం.

**సానుకూలంగా స్పందించిన స్పెషల్ సిఎస్ అజయ్ జైన్.**



అక్షర విజేత రాయదుర్గం

చారిత్రక ప్రసిద్ధినొందిన లింగాలబండ పశు పతినాథస్వామి ఆలయ అభివృద్ధి, పునరుద్ధరణ పనులను స్థానిక భక్తుల సహకారంతో చేపట్టేందుకు వీలుగా అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర టూరిజం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ కు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విన్నవించారు. విజయవాడలోని ఆయన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం కలుసుకొని ఆలయ అభివృద్ధిపై వినతిపత్రం అందజేశారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్న రాయదుర్గం నియోజకవర్గంలో శైవ భక్తులు అధిక సంఖ్యలో నివసిస్తున్నారని పేర్కొన్నారు. శైవ ఆగమ శాస్త్రానుసారం ఈ ఆలయాన్ని పునరుద్ధరించి దాని పవిత్రతను పునరుజ్జీవింప జేయాలని, సక్రమ ఆరాధనకు అనువుగా మార్చాలని భక్తులు కోరుతున్నారని తెలియజేశారు. ఈ ఆలయం అపారమైన చారిత్రక మరియు ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను కలిగి ఉందని వివరించారు. భారతదేశంలో ఇలాంటి ఆలయాలు చాలా అరుదుగా ఉండగా ఈ ఆలయాన్ని నేపాల్‌లోని ప్రపంచ ప్రసిద్ధి చెందిన పశుపతినాథ ఆలయంతో పోలుస్తారని తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఒక సందర్భంలో రాయదుర్గం మరియు ఈ ఆలయాన్ని ప్రస్తావించడంతో, ఈ దేవాలయానికి జాతీయ స్థాయిలో ప్రాధాన్యం మరియు గుర్తింపు లభించిందన్నారు. ఈ ఆలయాన్ని మొదట చాళుక్య వంశానికి చెందిన పాలకులు నిర్మించగా అనంతరం విజయనగర సామ్రాజ్య పాలకులు దీనిని పునరుద్ధరించారని గుర్తుచేశారు. దురదృష్టవశాత్తు కాలక్రమేణా పవిత్ర శివలింగం నందులు దెబ్బతిని నిత్య పూజలు మరియు అభిషేకాలు సక్రమంగా నిర్వహించడం కష్టంగా మారిందని విన్నవించారు. అమూల్యమైన సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రోత్సహించి, స్థానిక ప్రజలకు మేలు చేకూరుతుందని ఇదివరలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించానని తెలియజేశారు. తన విజ్ఞప్తి మేరకు సదరు లేఖపై ముఖ్యమంత్రి కార్యాలయం నుండి పంపిన ఉత్తరాన్ని కూడా ఇందువెంట జతపరచడం జరిగిందన్నారు. ఈ ఆలయాన్ని రాష్ట్ర పురావస్తు శాఖ పరిధి నుండి డీ-నోటిఫైచేసి స్థానిక భక్తుల సహకారంతో అభివృద్ధి చేసుకునేలా అనుమతులు ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తిపై అజయ్ జైన్ సానుకూలంగా స్పందించారు. తప్పకుండా త్వరలోనే అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఉత్తమ సేవలకు గుర్తింపు ప్రశంసా పత్రాలు.

## -ఐసిడిఎస్ సిడిపిఓ శ్రీదేవి, ఎక్సైజ్ శాఖ సీఐ కూర్మా రావు.





అక్షర విజేత,చింతపల్లి :

విధినిర్వహణ లో ప్రజల కు ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. చింతపల్లి మండలానికి సంబంధించి ఐసిడిఎస్ లో ఉత్తమ సేవలు అందించిన సిడిపిఓ శ్రీదేవికి కలెక్టర్ దినేష్ కుమార్ చేతులు మీదుగా, అదే క్రమంలో స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్ స్పెక్టర్ జె. కూర్మారావు ఎస్పీ అమిత్ బర్దర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు పొందారు. ఈ సందర్భం గా వారు మాట్లాడు తూ తమ సేవ లను గుర్తించిన ప్రభుత్వం తమను మరింత ప్రోత్సహించేందుకు గణతంత్ర దినోత్సవంను పురస్కరించు కుని ప్రశంస పత్రాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. దీంతో తమ శాఖలలో మరింత ఉత్సాహం గా సేవలు అందించేందుకు ప్రోత్సాహం కల్పించినట్లు అయిందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు..

# బలపం పంచాయతీలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం.

## - చెరువూరుకోరుకొండ, కోరుకొండ- బండ్రైవ్ వంతెన నిర్మాణ పనులకు శ్రీకారం.



అక్షర విజేత ,చింతపల్లి :

మండలంలోని మారుమూల పంచాయతీ అయిన బలపం పంచాయతీ పరిధిలోని చెరువూరుకోరుకొండ గ్రామాల మధ్య రహదారి, వంతెనల నిర్మాణానికి, అదే క్రమంలో కోరుకొండ బండ్రైవ్ వంతెనల నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ ద్వారా మంజూ రైన కోటి 90 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. వర్షాకాలంలో ఆ గ్రామాల మధ్య చెరువు నీరు పొంగి పొర్లడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అవరోధాలు ఏర్పడు తున్న నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజల దీర్ఘకాలిక డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మాణ పనులను ప్రారంభిం చారు. ఈ నిర్మాణ పనులు పూర్తయితే విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, గ్రామస్తులు సురక్షితంగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆ పంచా యతీ సర్పంచ్ కె రమేష్ నాయుడు, వైయస్సార్ సిపి నాయ కులు బచ్చలి బాబురావు, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ మాట్లాడు తూ, గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా మంజూరు చేసిన నిధులతో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులను సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆ పంచాయతీ వార్డు సభ్యులు కృష్ణ, లింగరాజు, లింగరావు, లక్ష్మి, సోమరాజు, కూటమి నాయకులు అప్పారావు, చిట్టీబాబు, నారాయణరావు, వీరయ్య దొర పాల్గొని తమ మద్దతు తెలిపారు. అలాగే గ్రామ పెద్దలు మత్స్య లింగం, నగేష్ రావు, చిట్టీబాబు, రామారావు, చిన్నబాయ్, బాబురావు, బాలకృష్ణ, లక్ష్మణ్ లోత, పరమేష్, కోయంగి, పండమ్మ వండలం, చంటిబాబు, శ్రీనివాస్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వర్గ పోరాటయోధుడు కామ్రేడ్ నంద్యాల సుబ్బారావు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ.




బుట్టాయగూడెం . అక్షర విజేత.

కార్మిక వర్గ పోరాట యోధుడు, విప్లవోద్యమ నాయకుడు కామ్రేడ్ నంద్యాల సుబ్బారావు 18వ వర్ధంతి సభ ఆకివీడులో న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఐ ఎఫ్ టీ యు మండల కార్యదర్శి తోట రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఐ ఎఫ్ టీ యు జిల్లా ప్రధాన కార్యదర్శి బి వెంకట్రావు, ఐ ఎఫ్ టీ యు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ రామ్మోహన్ లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలపై ఉద్యమకారులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయని వారు ధ్వజమెత్తారు. దేశంలో వ్యవసాయ రంగం తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీ పరిసర ప్రాంతాలలో పెద్ద ఎత్తున రైతంగం ఉద్యమిస్తే వెనుకు తగ్గిన ఎన్డీఏ ప్రభుత్వం మరల వ్యవసాయ నల్ల చట్టాలను అమలు కోసం ప్రయత్నం చేస్తున్నాయని వారు వాపోయారు. రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరల కోసం ప్రత్యేక చట్టం తేవాలని రైతులు కోరు కుంటుంటే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. ఇప్పటికే దేశంలోకి విత్తన చట్టం , నూతన విద్యుత్ చట్టం తీసుకువస్తూ ప్రజలపై తీవ్ర భారాన్ని మోపు తున్నాయని మండిపడ్డారు. కార్మిక రంగాన్ని కార్పొరేట్ పెట్టుబడిదారుల కి కట్టబెట్టడం కోసం పాత కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చారని తెలియజేశారు. వీటిని ప్రశ్నించిన ఉద్యమకారులపై నిర్బంధాన్ని ప్రయోగించడం అక్రమ అరెస్టులు కొనసాగించడం ప్రభుత్వాలు చేస్తున్నాయని అన్నారు. ప్రజా ఉద్యమాలు నిర్వహించినప్పుడే అమరవీరులకు మనము ఇచ్చే నివాళి అని తెలిపారు. ముందుగా నంద్యాల సుబ్బారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అజయ్ కుమార్, సత్యనారాయణ, గుణ, లక్ష్మి పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

## "ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు - పాఠశాల కు ఇరువది వేలు వితరణ"



పాతపట్నం పాతపట్నం స్థానిక ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల లో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు కు స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమం ను ప్రారంభించారు.ప్రిన్సిపల్ రత్నకుమారి వార్షిక విద్యా ప్రగతి నివేదిక ను తెలియజేశారు ఈ విద్యాసంవత్సరం లో పాఠశాల సాధించిన వివిధ విజయాల ను ప్రస్తావించారు.అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయ సిబ్బంది ఎమ్మెల్యే కి దుశ్శాలువ, జ్ఞాపిక తో సత్కరించుకున్నారు.

ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాల విద్య పై ప్రత్యేక దృష్టి సాధించారు అని, విద్యార్థులు కు సర్వేపల్లి విద్యామిత్ర కిట్స్, తల్లికి వందనం వంటి సౌకర్యాలు తో పాటు అనేక మైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలి అని సూచించారు.ఎమ్మెల్యే గారు పాఠశాల అభివృద్ధి కోసం అక్షరాల ఇరువది వేల రూపాయలు ను పాఠశాల ప్రిన్సిపల్ రత్నకుమారి గారు కు అందజేశారు.విద్యార్థిని విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆహుతులను అలరించారు.తరగతి లో ప్రతిభ చూపిన విద్యార్థులు కు, వంద శాతం అటెండెన్స్ ఉన్న విద్యార్థులు కు గోల్డ్ మెడల్స్ మరియు ప్రశంసా పత్రాలు ను బహుకరించారు

ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు, స్థానిక కూటమి నాయకులు, వైస్ ప్రిన్సిపల్ ప్రసాద రావు పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

## హోటల్ వ్యాపారస్తులకు హెచ్చరిక




తాడేపల్లిగూడెం, (అక్షర విజేత) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:హోటళ్లు, స్వీట్లు, బేకరీ, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, కర్రీ పాయింట్ తదితర తినుబండారాల వ్యాపారులు ఆహార భద్రత చట్టంలో పేర్కొన్న నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని లేనిచో కఠిన చర్యలు తప్పవనిఆహార భద్రతాధికారి వెంకటరత్నం హెచ్చరించారు. ప్రజారోగ్యాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వంతోపాటు వ్యాపారులపై కూడా ఉంద న్నారు. తాడేపల్లిగూడెం హోటల్స్ స్వీట్స్ బేకరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గుణం ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోటళ్లలో పాటించాల్సిన ఆహార భద్రతా నిబంధనలను వివరించారు. హోటళ్లలో పరిశుభ్ర వాతావరణం లేకపోవడం వల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని, ముఖ్యంగా ఆహారంలో వాడే టేస్టింగ్ సాల్ట్, కృత్రిమ రంగులు శరీరానికి హానికరమని, కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ప్లాస్టిక్ కవర్లలో వేడి పదార్థాలను వాడటం వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలతో పాటు ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఆహారంలో అనవసర రసాయనాల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. ఆహార భద్రత చట్టాలలోని కొత్త నిబంధనలపై హోటల్ యజమానులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించని హోటళ్లపై కఠిన చర్యలు తప్పవని వెంకట రత్నం స్పష్టం చేశారు.

హోటల్ నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించి, ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించాలని కోరారు. సంఘం గౌరవ అధ్యక్షులు పైబోయిన రఘు మాట్లాడుతూ అనవసర పోటీ వద్దని, వన్ ప్లస్ వన్, తిన్నంత బిర్యాని, అతి తక్కువ ధరలకే బిర్యానీ వంటి అనవసర పథకాలు వద్దని సూచించారు. చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ ప్రజారోగ్యాన్ని కాపాడాలని న్యాయంగా వ్యాపారం చేసేవారికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు, సంఘం పట్టణ అధ్యక్షుడు వేగి శ్రీనివాస్ మాట్లాడుతూ హోటళ్ల వ్యాపారం నష్టాల్లో ఉందని, ప్రజలు,అధికారులు



సహకరించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలను పాటించే విధంగా సంఘం తగిన చర్యలు చేపడుతుందని ఆయన తెలియజేశారు. అవగాహన సదస్సులో హోటళ్ల సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని హోటళ్లు, తినిబండారాల వ్యాపారులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు



# చిరంజీవి చేతుల మీదుగా జ్ఞాపిక అందుకున్న ఎగ్జిబిటర్ అంజిబాబు

అక్షర విజేత దేవరపల్లి

హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో నిన్న రాత్రి ఆల్‌టైమ్ ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన ప్రాంతీయ చిత్రం “మన శంకర వరప్రసాద్ ” ఘన విజయాన్ని పురస్కరించుకుని నిర్వహించిన డిస్ట్రిబ్యూటర్స్ & ఎగ్జిబిటర్స్ సక్సెస్ మీట్ వేడుక వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు భారీ సంఖ్యలో హాజరై చిత్ర బృందానికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రేక్షకుల నుంచి లభించిన అపూర్వ ఆదరణతో ప్రాంతీయ చిత్రాల స్థాయిని కొత్త ఎత్తులకు తీసుకెళ్లిన ఈ చిత్రం సినీ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా చిత్ర ఘన విజయాన్ని గుర్తుగా దేవరపల్లికి చెందిన అంజి బాబు, అలియాస్ (ఆంజనేయులు) రేవంత్ సాయి లకు , మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా జ్ఞాపికను అందుకున్నారు . కార్యక్రమం ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సాహంగా సాగి విజయవంతంగా ముగిసింది.

# పోచమ్మ తల్లి ఆలయం తాత్కాలిక మూసివేత.

అక్షర విజేత దేవీపట్నం



పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలం గొందూరు మాతృశ్రీ గండి పోచమ్మ గోదావరి ఒడ్డున ఉన్నటువంటి ఆలయముకు పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా తాత్కాలికంగా దర్శనాలు నిలిపివేయడం జరిగిందని ఎగ్జిక్యూటి అధికారి ఆకుల లక్ష్మి కుమార్ తెలియజేశారు. అదేవిధంగా పోలీస్ రెవెన్యూ అధికారులు సహకరించి గండి పోచమ్మ ఆలయానికి వచ్చే రహదారుల వద్ద ఎవ్వరిని రాకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గండి పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మలుగుల శ్రీనివాస్ రెడ్డి, పాము గండి పంచాయతీ సర్పంచ్ శివారెడ్డి, గండి పోచమ్మ ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఐక్యతతోనే జర్నలిస్టుల అభివృద్ధి సాధ్యం

## -జీలుగుమిల్లి లో ఏ పీ యూ డబ్ల్యూ జే ఎఫ్ ముఖ్య సమావేశం

అక్షర విజేత జీలుగుమిల్లి

జీలుగుమిల్లి మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీయూడబ్ల్యూజేఎఫ్) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జర్నలిస్టులంతా ఐక్యంగా ముందుకు సాగాలని, వృత్తిలో ఎదుర్కొంటున్న సమస్యలపై పరస్పరం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో జర్నలిస్టులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని, వాటిని సమిష్టిగా ఎదుర్కొనడమే ఏకైక మార్గమని నాయకులు పేర్కొన్నారు. వచ్చే నెలలో నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించనున్న ఏపీయూడబ్ల్యూజేఎఫ్ సమావేశాన్ని జయప్రదం చేసే దిశగా అందరూ సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్టులు నెలటూరి అప్పారావు, కొప్పుల సాయి, నక్కా శ్రీనివాస్, చాపల లక్ష్మణ్, మర్రి జాన్ మోసెస్, ఓబిలిశెట్టి రవి, కూరాకుల సత్యనారాయణ, మేకల మంగరాజు, కడిమి సాయి, జాలా వంశీ, మారుముడి జయంత్, బట్టు సందీప్, కూరాకుల రామాంజనేయులు, వారిగేటి బెంజ్, బల్లె రవికుమార్, మరీదు మంగరాజు తదితరులు పాల్గొన్నారు.



# అధికారుల సేవలకు గుర్తింపు



తాడేపల్లిగూడెం, (అక్షర విజేత) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: రెవిన్యూ శాఖలో వివిధ విభాగాలలో విశేష ప్రతిభ కనబరిచిన అధికారులు ప్రభుత్వ ప్రశంసలు అందుకున్నారు. వీరికి భీమవరం కలెక్టరేట్లో నిర్వహించిన 77వ గణతంత్ర వేడుకలలో కలెక్టర్ చదలవాడ నాగరాణి తాడేపల్లిగూడెం ఎంఆర్ఓ కార్యాలయ సూపరింటెండెంట్ కాళీ కృష్ణ, పౌరసరఫరాల డిప్యూటీ తాసిల్దార్ అన్నపూర్ణ, ఆర్డిఓ కార్యాలయ డిప్యూటీ తాసిల్దార్ పోతురాజు, టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్ లక్ష్మికి ప్రశంస పత్రాలు అందజేశారు. ప్రశంస పత్రాలు అందుకున్న వారిని ఆర్డిఓ ఖతీబ్ కౌసర్ భానో, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

# ఉత్తమ కమిషనర్ గా ఏసుబాబు

తాడేపల్లిగూడెం, (అక్షర విజేత) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: ప్రజా ఫిర్యాదుల సదస్సులో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో విశేష ప్రతిభ కనబరిచిన తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారు. భీమవరం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరా ణి ఆయనకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఆయనతోపాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన మున్సిపల్ ఇంజనీర్ వెంకటరమణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సీతారాం, అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, సంక్షేమ కార్యదర్శి శ్రావణి, పారిశుధ్య కార్యదర్శి రజిని లకు కూడా కలెక్టర్ ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి పాల్గొన్నారు.



# అరకులో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



అక్షరవిజేత,అరకులోయ :

జనవరి 29వ తేదీ గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు అరకు పర్యటనకు రానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తోంది. అరకులో ఘనంగా నిర్వహించనున్న “చలి ఉత్సవ్“ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ పర్యటన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ అరకులోని ప్రధాన వేదిక, హెలిపాడ్, హోమ్ స్టే ప్రాంతాలను సందర్శించారు. హెలిపాడ్ వద్ద భద్రతా ప్రమాణాలు, బారికేడింగ్ పనులను పరిశీలించి, పైలట్ల నిబంధనల మేరకు పనులు ఉండాలని సూచించారు. సభకు వచ్చే గిరిజన ప్రజలకు, పర్యాటకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా త్రాగునీరు, నీడ మరియు మొబైల్ టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. “అరకు చలి ఉత్సవం జిల్లా ప్రతిష్టను పెంచే కార్యక్రమం. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా ఎక్కడా చిన్న పొరపాటుకు కూడా తావు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి. ట్రాఫిక్ మళ్లింపులు, భద్రతా ఏర్పాట్లపై పోలీసు శాఖతో సంప్రదించి చర్యలు తీసుకోవాలి“ అని తెలిపారు. ఈ పర్యవేక్షణలో ఐటిడిఏ పిఓ తిరుమణి శ్రీపుజ, సహాయ కలెక్టర్ సాహిత్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉత్తమ జేఈగా రవిబాబు



తాడేపల్లిగూడెం, (అక్షర విజేత) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: విధి నిర్వహణలో విశేష ప్రతిభను కనబరుస్తూ రహదారుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్న తాడేపల్లిగూడెం రహదారి భవనముల శాఖ జేఈ డి రవిబాబు ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారు. భీమవరం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ చదలవాడ నాగరాణి ఆయనకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి పాల్గొన్నారు.

# హోం మంత్రిని కలిసిన పట్టణ టిడిపి అధ్యక్షుడు నందిగం శ్రీధర్







అక్షర విజేత దేవరపల్లి

మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత. ఎమ్మెల్యేలు గౌత శిరీష సోమిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లి పట్టణం టిడిపి అధ్యక్షుడు నందిగం శ్రీధర్ తదితర దేశం నాయకులు.

# సంతోషంలో చింతాడ వలస ఉపాధి శ్రామికులు

## -ఎంపీడీవో చొరవతో ఎట్టకేలకు ఉపాధి పనులు

అక్షర విజేత మెంటాడ:



మండలంలోని సంవత్సరం ఏడాదికాలంగా ఉపాధికి నోచుకోని చింతాడవలస గ్రామ ప్రజలు ఎంపీడీవో సుదర్శన్, ఏపీవో చిన్నప్పయ్య చొరవతో ఎట్టకేలకు ఉపాధి పనుల బాట పట్టారు. సంవత్సరం తర్వాత తొలిసారిగా మంగళవారం 150 మంది ఉపాధి శ్రామికులు స్థానిక పెరుగువాని చెరువు పనులకు హాజరయ్యారు. చింతాడ వలస ఫీల్డ్ అసిస్టెంట్ వైసిపి ప్రభుత్వ హయాంలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ స్థానికులు అప్పట్లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ నిర్వహించిన అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్ ను విధులనుంచి తొలగించారు. ఆ క్రమంలో గ్రామంలో గొడవలు జరుగుతున్న నేపథ్యంలో ఉపాధి పనులను నిలిపివేచ్చారు. అనేకమార్లు పనులు కల్పించాలని ఉపాధి వేతనదారులు అధికారులను కోరిన ఫలితం కానరాలేదు దీంతో ఉపాధి వేతనదారులు నాన ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో సుదర్శన్ ఉపాధి వేతన్దారులకు పనులు కల్పించాలని నిర్ణయించారు. స్థానిక పెరుగువారిని చెరువులో మంగళవారం దగ్గరుండి ఉపాధి పనులు జరిపించారు. సంవత్సరం తర్వాత ఉపాధి పనులు ప్రారంభించడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చొరవ చూపిన ఎంపీడీవో సుదర్శన్ కు ఏపీఓ చిన్నప్పయ్యకు ధన్యవాదాలు తెలిపారు.

